# మనిషిలో మనిషి



ఇంటికి రాగానే సరోజ అంది.

"ఇప్పుడే నవోదయ ఎడిటర్‌గారు ఫోన్ చేసారండీ. దీపావళి ప్రత్యేక సంచిక నుండి మొదలు పెట్టడానికి సీరియల్ ఏదో రాసిస్తానన్నారటగా. తయారయిందా అని వాకబు చేశారు"

"చచ్చాంరా దేవుడా" అనుకున్నాను. కాస్త పేరు ప్రఖ్యాతులు రాగానే ఎడిటర్లు పరిచయమవుతారు. మొహమాటాలు పెరుగుతాయి. సీరియల్ మొదలుపెట్టేద్దాం, రాసినదాకా ఇచ్చేయండి అని తొందర పెట్టేస్తారు. ఏ వారానికి ఆ వారమే టెన్షన్.

మొదలుపెట్టిన ప్రతిసారీ లెంపలేసుకోవడం, నవల పూర్తయ్యేదాకా అచ్చుకివ్వకూడదనుకోవడం, మళ్లీ ఏదో మొహమాటం రావడం. ఇదీ కథ. నవోదయం ఎడిటర్ భలే చమత్కారి. తనను మాటల్లో పెట్టేసి కొత్త సీరియల్ గురించి మాట తీసుకున్నాడు. ఇప్పుడు ఫోన్ల మీద ఫోన్లు.

కుర్చీలో కూలబడుతూ "ఇంకా ఏమన్నాడు?" అని అడిగాను.

"మామూలుగా అందరూ చెప్పేదే. చాలా ప్రత్యేకంగా రాయమన్నాడు. పెద్ద పెద్ద రచయితలు, రచయిత్రులూ రాస్తున్నారుట. మీ ఇమేజ్‌కి తగ్గట్టు రాస్తారని ఆశిస్తున్నానన్నాడు. కొత్తదనం ఉట్టిపడేట్లు వుంటుందని ఎదురుచూస్తున్నాట్ట. ఆయన మాటకేంగానీ మీరు ఈసారైనా నోవెల్‌గా రాయండి. ప్రతిసారీ అడావుడిగా గిలికేయడం జరుగుతోంది."

కాఫీ తాగుతూ ఏదో పరధ్యానంగా "సరేలే" అన్నాను. కానీ రాత్రి టేబుల్ దగ్గర రాయడానికి కూర్చున్నప్పుడు నిజంగానే వెరైటీ రచన చేద్దామనిపించింది.

ఎమ్బీయస్ ప్రసాద్

సబ్జెక్ట్ గురించి ఆలోచిస్తుండగా మూర్తి గుర్తుకొచ్చాడు. వెంటనే వాడి పెళ్లి విషయం గుర్తుకొచ్చింది.

వివేకానందమూర్తి మా క్లాస్‌మేట్. కాలేజీలో కూడా ఏవో సాదాసీదా మనిషిగానే నెట్టుకొచ్చేవాడుగానీ ఏ విధమైన ప్రత్యేకతా, చొరవా ప్రదర్శించలేదు. అందుకే వాడు కొంతకాలం పోయాక అందర్నీ ఎదిరించి వాళ్ల పిన్నికూతుర్ని చేసుకుంటానన్నప్పుడు మేమంతా తెల్లబోయాము. "మతీగితీ ఏమైనా చెడిందా? చెల్లెలి వరస దానితో కాపురం చేస్తానంటావేమిటి? బుద్ధుందా?" అని చివాట్లేసాను.

వాడు దానికి పెద్ద లెక్చరిచ్చాడు. బంధుత్వాలు, వరసలూ మనం ఏర్పరచుకున్నవే. కానీ అత్తకూతురికీ, పిన్నికూతురికీ తేడా ఏముందన్నాడు. ఇద్దరూ రక్త సంబంధీకులేకదా అన్నాడు. మనకు పనికొచ్చే మేనరికాలు పక్క రాష్ట్రాల్లో పనికిరావుకదా. వాళ్లు అత్తకూతుర్ని చెల్లెలిగానే చూస్తారుకదా అన్నాడు. మిగిలిన మతాల్లో సవితి చెల్లెల్ని చేసుకోరా? అన్నాడు. ఈజిప్టులోనో, మరో దేశంలోనో స్వంత చెల్లెల్నే చేసుకున్నారట. పురాణకాలంలో... మనం అనుకోవడమేకానీ బంధుత్వాలదేముంది. పొమ్మన్నాడు.

నాకు చిరాకేసింది. పెళ్లికి (రిజిస్టర్ మారేజ్) వెళ్లలేదు. అదృష్టవశాత్తు అందరికీ దూరంగా ఉద్యోగరీత్యా వెళ్లిపోయాడుగానీ లేకపోతే ఈ కారణంగా మా ఇద్దరిమధ్యా పోట్లాటలు వచ్చి వుండేవి. వాడి గురించి నేను మళ్లీ ఏమీ వినలేదు. పట్టించుకోలేదు.

వాడి జీవితం ఎలా సాగి వుంటుందా అని ఆలోచించాను. అంతటి దారుణమైన వరసతో కాపురం చేసేవాళ్లు ఎటువంటి మానసిక సంఘర్షణకు గురయి వుంటారో ఊహించాను. ఇది చక్కటి సబ్జెక్టు అనిపించింది.

పాఠకుడికి కావాల్సింది వైవిధ్యం. ఎందుకంటే మామూలు రొటీన్ జీవితాల వాళ్లే నూటికి తొంభైతొమ్మిది మనుష్యులు! అదే శాతంలో పాఠకులూ వుంటారు. తమ జీవితాల గురించే మళ్లీ చదువుకోవడానికి వాళ్లలో ఉత్సాహం ఏముంటుంది? అందువల్ల కొన్ని అసాధారణ పరిస్థితుల గురించి, అసాధారణ వ్యక్తుల గురించి రాయాలి. అంటే సముద్ర మధ్యంలో వున్న దీవుల్లో ఉండే జాలర్ల గురించి, అడవుల్లో బతికే ఆదివాసుల గురించి రాస్తే చదవరు. వాళ్ల మధ్యనున్న వారి గురించీ, వారు గుర్తుపట్టగలిగే వ్యక్తుల జీవితాల నుండి అసాధారణ సన్నివేశాలు సృష్టించాలి. అప్పుడే వారికి ఉత్సాహం పుడుతుంది.

నవల రాస్తున్నకొద్దీ నా ఆలోచన సరైనదనే నమ్మకం పెరిగింది. సమస్య నిజంగా జటిలమైనదే. చిన్నప్పటినుంచీ చెల్లెలు అన్న పదానికి పవిత్రత నాపాదిస్తూ వచ్చిన మోహనరావు (పేరు మార్చాను) తన భార్యతో సెక్స్ అనుభవించలేక, తన మనస్సును చంపుకోలేక పడిన వేదనలను చాలా బాగా వర్ణించగలిగాను. వాళ్లకు పిల్లలు పుట్టడం, వాళ్లను తమ పాపఫలితాలుగా, అక్రమ సంబంధానికి ఋజువులుగా వీళ్లు భావించడం సంఘం వారిని గేలి చేయడం, దానివల్ల వీరికి కలిగే మనస్తాపం అన్నీ చక్కగా వివరించగలిగాను. రాసినది చదువుకుంటుంటే నేను అవన్నీ ప్రత్యక్షంగా చూసి మరీ రాస్తున్నట్లు ఫీలయ్యాను. రవి కాంచకపోయినా రచయిత కాంచగలడుగా!

చాలా కాలానికి నచ్చిన నవల రాయగలిగినందుకు ఆనందించాను. ప్రజల దృష్టిలో నా రచనలన్నీ గొప్పవే కావచ్చు. కానీ నాలోని విమర్శకుడు నాలోని రచయితను మెచ్చుకునేది చాలా తక్కువసార్లు మాత్రమే. వాటిల్లో ఈ సందర్భం ఒకటి. సగందాకా రాసేటప్పటికి పత్రికలవాళ్ల ఒత్తిడి ఎక్కువైంది. సీరియల్ ఆరంభించవలసి వచ్చింది.

సీరియల్ పడుతుండగా పాఠకుల ప్రతిస్పందన అమోఘంగా వుంది. చాలా ధైర్యంగా ఒక వింత సమస్యను ఎత్తుకున్నాననీ, ముగింపు ఎలా వుంటుందోనని ఉత్కంఠగా వుందనీ, అశేషంగా ఉత్తరాలు రాసాగాయి. 'ముగింపు బాగుండాలండోయ్' అంటూ ఎడిటర్‌గారు హెచ్చరించారు కూడా. లేకపోతే పాఠకులు ఊరుకోరుట.

ప్రతి మనిషికీ సాహసాలు చేయాలనే వుంటుంది. ఎస్టాబ్లిష్‌మెంట్‌ను ఎదిరించాలనీ, ప్రస్తుత

పరిస్థితులకు ఎదురీదాలనీ, వుంటుంది. కానీ అలా చేస్తే వచ్చే కష్టనష్టాలను బేరీజు చేసుకుని చప్పబడిపోతాడు. అందువల్ల వేరెవరైనా అలా తిరగబడితే ముందు హర్షించినట్టు కనబడినా వాడెన్నటికైనా ఓడిపోయి తీరడతాడని అంచనాలు వేస్తాడు. తనకు తెలియకుండానే ఆశిస్తాడు. 'నేనే చేయలేకపోయాను. వీడెలా చేస్తాడు? శుద్ధ తెలివితక్కువ ! అనుభవిస్తాడు చూడు' అని అనుకుంటూ ముగింపుకోసం ఎదురుచూస్తాడు. వాడు దెబ్బతింటే 'పాపం' అని పైకి అన్నా అతని కడుపుమంట చల్లారుతుంది. 'అంతేమరి. సంఘం కట్టుబాట్లు ఎదిరిస్తే అలాగే జరుగుతుంది. ఏం చేస్తాం!' అని నలుగురి ముందు వాపోతాడు. తను ఆ పని చేయనందుకు తనని తాను అభినందించుకుంటాడు, ఆనందిస్తాడు. రేపెవరైనా ఆ పని చేయబోతే ఈ కథను దృష్టాంతంగా చూపి వాళ్లని వారిస్తాడు. తనే చేయలేని అసాధారణమైన పనిని ఎదుటివాళ్లు చేసేస్తామంటూంటే చూస్తూ ఊరుకోవడం ఎలా?

అందువల్ల జనాలు మెచ్చేటట్లు, ఆమోదించేటట్లు, హర్షించేటట్లు ముగింపు మలిచాను. చివర్లో వారిద్దరూ విడిపోయినట్టు, భార్య ఆత్మహత్య చేసుకున్నట్టు, భర్త పిచ్చివాడయినట్టు ముగింపు రాసేను. రచన వాస్తవానికి దగ్గరగా ఉండాలన్నమాట నిజమేగానీ మూర్తి జీవితం గురించి ఆలోచించి చూస్తే ఇంతకంటే విభిన్నంగా వుంటుందని నాకు తోచలేదు. ఇంత విషాదకరమైన ముగింపు మెలోడ్రమెటిక్‌గా వుంటుందని ముందు భయపడ్డానుగానీ పాఠకులు కూడా కన్విన్స్ అయ్యారు - ఇటువంటి వాళ్ల బతుకులు ఇలాగే అంతమవుతాయని! నేను రాసిన దానిని యదార్థంతో పోల్చి చూసేందుకు నాకు కుతూహలం వున్నా అవకాశమెక్కడ? ఆ అవకాశం వస్తుందని నేనెన్నడూ అనుకోలేదు.

అందుకే ఆ అవకాశం వచ్చినప్పుడు నేను తబ్బిబ్బు అయిపోయాను. సంచలనాత్మకమైన నవల రాసినందుకు ఉగాది సందర్భంగా బొంబాయి ఆంధ్ర మహాసభవాళ్లు నాకు సన్మానం ఏర్పాటు చేసారు. బొంబాయి వెళ్తుండగా మహారాష్ట్రలో ఓ చిన్న స్టేషన్లో రైలు ఆగాల్సి వచ్చింది, ముందు స్టేషన్లో ఏదో యాక్సిడెంట్ అయిన కారణంగా! ఫ్లాట్‌ఫాం మీద పచార్లు కొడుతూ వుంటే స్టేషన్ మాస్టారు యూనిఫాంలో మూర్తి కనిపించాడు. ఎగిరి గంతేసాడు. ఇంకా రెండుగంటలదాకా టైముందని చెప్పి పక్కనే వాళ్ల క్వార్టర్స్‌కు లాక్కుపోయాడు.

అక్కడ వున్న రెండు గంటల్లో నాకు విషాదచ్ఛాయలు, విచార మేఘాలు ఏమీ కనబల్లేదు. వాడి కొడుకులిద్దరూ బంతుల్లా వున్నారు. వాళ్ల ఆవిడ పూలరథంలా వుంది. నాకు గుండెల నిండా వెలితి, నస్పని బాధ. నేను ఎంతో తార్కికంగా, రేషనల్‌గా ఆలోచించి రాసినదానికి వ్యతిరేకంగా ఎందుకు జరిగాలి? నా అంచనా ఎక్కడ తప్పింది? ఎందుకు తప్పాలి?

నా ఆలోచనల్లో నేను సతమతమవుతుంటే వాడు హుషారుగా చెప్పుకుపోతున్నాడు - బంధువులు క్రమంగా దగ్గరవుతున్నారట. స్థలం కొన్నాట్ట. పిల్లలకు క్లాసులో ఫస్టు రాంకులట. ఏమిటిదంతా? వీడు ఇంత సుఖంగా ఎలా వుండగలుగుతున్నాడు? వీడికి అంతరాత్మలేదా? వున్నా బాధపెట్టదా? సమాజం వీళ్లని వేధించలేదా? వేధించాలిగదా! ఈ రకం పెళ్లిళ్లు విజయవంతం ఎలా అవుతాయి? నా తలలో వెయ్యి ఆలోచనలు. నా మీద నాకే చికాకు, కోపం. నా ఆలోచనాశక్తి మీద నాకే అపనమ్మకం.

బొంబాయిలో సన్మానసభ ఘనంగా జరిగింది. కానీ నా మనస్సు మనస్సులోలేదు. వక్తలు ఒకరి తరువాత ఒకరు నా కొత్త నవలను ప్రస్తావించి దాని వాస్తవిక చిత్రీకరణను మెచ్చుకున్నప్పుడల్లా నాకు ఏదో ముల్లు గుచ్చుకున్నట్టయింది. ఓ స్వామిజీ వచ్చి అర్ష సంప్రదాయాన్ని నిలబెట్టినందుకు, దారి తప్పినవాళ్లు ఎలా ధ్వంసమవుతారో హెచ్చరించినందుకు నన్ను అభినందించారు. ముందే ఉపన్యాసం రాసిపెట్టుకున్నాను కాబట్టి సరిపోయింది కానీ లేకపోతే నరాలు కృంగిపోయిన ఆ స్థితిలో ఏం మాట్లాడి వుండేవాణ్నో నాకే తెలియదు.

సభ అయిపోయాక అసోసియేషన్ ముఖ్యులందరితో కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుతుంటే ఎవరో అడిగారు "ఈ నవల ధోరణి చూస్తే మీకు ఆ పాత్రలతో ప్రత్యక్ష పరిచయం వున్నట్టూ, మీరు అవన్నీ స్వయంగా చూసి ఫీలయి లోకానికి ఓ నీతి చెప్దామని ప్రయత్నించినట్టూ అనిపిస్తోంది. ఇది మీ

జీవితంలో నిజంగా జరిగిందా?" అని.

"మీరన్నది కొంతవరకు నిజమే. ఆ అమ్మాయి నా క్లాస్‌మేట్. వాళ్ల కజిన్ బ్రదర్ని పెళ్లి చేసుకొంది. వాళ్లు నిశ్చయించుకున్నాక పెళ్లి ఏర్పాట్లకు నేను సాయం కూడా చేసాను. ఆ తరువాత నేను కలవలేదనుకోండి. కానీ పదేళ్లు పోయిన తరువాత మద్రాసులో ఓసారి పిచ్చాసుపత్రికి వెళితే అక్కడ కనబడింది. ఈ పాపంలో నా పాలు కూడా ఎంతో కొంత వుంది కాబట్టి, దాన్ని ప్రక్షాళన చేసుకుందామని, ప్రజల్ని హెచ్చరిద్దామని కాస్త మార్పులతో ఈ నవల రాయడం జరిగింది"

అలా అబద్ధం ఎందుకు చెప్పాలనిపించిందో నేను వివరించలేనుగానీ అలా చెప్పడం నాకెంతో తృప్తినిచ్చింది. అందుకే మధ్యదారిలో మూర్తిని కలవడం అనేది ఒక కల అనీ, నేను వాళ్లకు చెప్పినదే నిజమనీ నమ్మడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నాను. మనస్సుకు రిలీఫ్ కన్నా కావాల్సింది ఏముంది?

●

(ఆంధ్రభూమి వీక్లీ జనవరి 1997)